# ఆదర్శ జీవులు

శకుంతలా సుదర్శనుల వివాహం అయిపోయిన తరు వాత ఒక వారంరోజులవరకూ ఊరుఊరంతాకూడా ఆ విష యాన్ని గురించే మాట్లాడుకొన్నారు. కారణం ఏమిటీ అంటే ఆ పెళ్ళి అన్ని పెళ్ళిళ్ళలాగ జరగలేదు.

పెళ్ళికి పూర్వమే సుదర్శనం ఇంటికి శకుంతల రావ టం, శకుంతల ఇంటికి సుదర్శనంరావటం జరిగింది. వాళ్ళిద్దరూ కలిసి బహిరంగంగా మాట్లాడుకొనేవాళ్లు. ఇద్దరూ కలిసి సిని మాకో, నాటకానికో, పార్కుకో వెళ్లుతూఉండేవాళ్ళు.

సంఘంలో కొంతమందికి ఇది విపరీతంగానే వుండేది. "వాళ్లిద్దరూ పెళ్ళి చేసుకొంటారట! చూశావా ఎంత అన్యో న్యంగా ఉన్నారో!" అన్నది ఒకావిడ. ప్రక్కనే నుం చున్న ముసలమ్మ ఆశ్చర్యపోయి, ముక్కుమీద వేలేసుకొని, "అరి, వీళ్ళమ్మ కడుపులు బంగారంకానూ, చెట్టాపట్టాలు పట్టుకొని తిరుగుతున్నారే. ఎంత మొగుడూ పెళ్లాలు అయితే మటుకు? అయినా యింకా మూడు ముళ్లూ పడందే!" అన్నది.

ప్రక్కనే ఆముసలమ్మ మనుమరాలు ఆవిడను చెయ్యి పట్టుకొని లాగి, "ముసలిదానవు నీకేం తెలుసే ఇప్పటికి కాలపు సంగతులు. వాళ్ళెవరో తెలుసా? శకుంతలా సుదర్శన మూను. ఇద్దరూ పెద్ద చదువులు చదువుకున్నారు. ఇద్దరూ కలిసి మన ఊరు, మన దేశం బాగుచేస్తా"రని మా హెడ్ మాస్టరు చెప్పాడు.

"ఓసి భడవా, నీ కడుపులో ఎన్ని ఊహలున్నయ్యో. అయితే నీకూ పెద్దవాళ్ళలాగే తిరగాలని అనిపిస్తున్నదా. ఏమిటి ఖర్మం! ఇకచాల్లే ఇంట్లోకిరా అని ముసలమ్మ ఆ పిల్లను లోపలికి లాక్కుని వెళ్ళింది. పెండ్లికి ముందు ఇల్లాంటి ముచ్చట్లు ఎన్నో జరిగినవి. పెండ్లిచేసుకోబోయే వారికి, శకుంతలా సుదర్శనుల దాంపత్య జీవితంలోనే, ఈ ప్రథమ స్కంధం ఆదర్శము కాక తప్పదని శాస్త్ర తెలిసిన వాళ్ళు అనుకొన్నారు.

పెళ్లికి కొన్నిరోజులకు పూర్వమే పెళ్లి ఎల్లాజరగాలె అని చాలా పెద్ద చర్చ జరిగింది. కామేశ్వరరావూ, సుదర్శనం, శకుంతలా, ఈ ముగ్గురూ కూర్చుని మాట్లాడుకొన్నారు.

పూర్వాచారానుగతంగా మేళతాళాలు ఉండాలె, పచ్చని తోరణాలతో ఇల్లు కళకళలాడుతూ ఉండాలె. పేరంటాళ్ళ వెకవెకలూ పెళ్ళి పెద్దల కేకలూ ఉండాలె, వదినా మరదళ్ళు, అక్కలు, బావలూ, బావమరదులూ సరసం ఆడుకోవాలె; బుక్కాయి చల్లుకోటాలు, బూజబంతులు, బెద్దబాశాలు. భోగం మేళాలూ ఉండాలె, డోళ్ళూ, దండాడింపులు ఉండాలే, వియ్యపురాలి బెట్టూ, వియ్యంకుడు గుట్టూ, గిల్లికజ్జాలు, చెంగ్లాటలు, పడుచుపిల్లల గలగలలూ, ఉండాలె; వీటి అన్నిటితో హడావుడిగా పెండ్లిజరగాలె అని కామేశ్వరరావు వాదించాడు. సుదర్శనం శకుంతలాకూడా పెద్దగా నవ్వేశారు.

శకుంతల హృదయాన్ని అడిగి తెలుసుకొని ఇవ్వన్నీ అనవసరమని నిశ్చయించింది. "సుదర్శనం నీ భర్త అని నా అంతరాత్మ చెప్పింది" అతడు నా భర్తే. ఈ విషయం ఇంత హడావుడిగా అందరికీ తెలియపరచ నక్కరలేదనుకుంది సుదర్శనం ఈ విషయాన్నే వైజ్ఞానికదృష్టితో విమర్శించి, ఇదంతా వ్యయంతో కూడుకొన్నపని అనీ, అనవసరమనీ, దాంపత్యాశయము విలాస ప్రతిపాదన కాదనీ వాదించాడు.

శకుంతలా, సుదర్శనంకూడా విషయాన్ని భిన్నదృష్టులతో చూచినా ఒకే తీర్మానానికి వచ్చారు. వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా చెపితే శకుంతల గాని, సుదర్శనం గాని వినరని, అటువేపూ, ఇటువేపూ కూడా తల్లిదండ్రులకు తెలుసు. అందుకని వాళ్ళు మాట్లాడలేదు. కామేశ్వరరావు మటుకు ఏం జేస్తాడు! మెదలకుండా ఊరుకొన్నాడు. చివరకు, అట్టే హడావుడిలేకుండా ఒక శుభ సమయంలో సుదర్శనం శకుంతలమెడలో తాళిబొట్టు కట్టాడు. అందరూ తలోక విధంగా అనుకొన్నారు. ఇదేం పెళ్ళమ్మా, బుడబుడా అయిందంటే అయిందనిపించారు! ఒక తలుపుదగ్గర పాటలేదు! పాన్పు వేయడం లేదు! పవ్వళింపు పాటలేదు! ఏం పెళ్ళో! ఏం లోకమో! అని ఒకావిడ చెక్కిళ్లు నొక్కుకున్నది.

"ఏమే పిల్లా దంపత్తాంబూలమైనా ఇప్పించలేదు" ఎంత చదువు చదువుకొంటే మటుకు ఇదేమిటే అమ్మాయ్!?. అని ఒక ముసలావిడ శకుంతలనే బుగ్గాబుగ్గా పొడిచి అడిగింది.

"మొగుడు పేరు చెప్పించనేలేదట పెళ్ళిలో, పోనీ ఇప్పుడైనా చెప్పు, మా సరదా ఎట్లా తీరాలె!" అని సరస మాడింది ఒకావిడ.

ఇవన్నీ అర్థంలేని ఆచారాలనీ, పిచ్చినమ్మకాలనీ శకుం తలకు గట్టినమ్మకం. స్త్రీలలో విద్యావ్యాప్తి చేసి, సంఘంలో పాతుకుపోయిన ఇల్లాంటి వ్యర్థమైన ఆచారాలనూ వాటినీ నిర్మూలం చెయ్యాలనీ కూడా శకుంతల గట్టిగా నిశ్చయించు కొంది. ఈ ఆడవాళ్ళ మాటలకు అప్పటికి నవ్వుకొన్నది. ఎవ్వరేమనుకొంటేనేమి ? శకుంతలా సుదర్శనలు వివిధ దృక్ప థాలనుంచి ఈ విషయాన్ని చూచి, ఇద్దరూ ఈ ఆచారాలను నిరసించారు. తెలియని ఆడవాళ్లు అల్లా అన్నా, తెలిసిన వాళ్ళంతా ఈ పద్ధతిలో వివాహం జరగటాన్ని చాలా మెచ్చు కొన్నారు. ఈ విధంగానే ఇకముందు వివాహాలు జరగాలెనని ఇదే ఆదర్శమని కూడా అన్నారు. ఆ దాంపత్య కల్పతరువుకు ఇది ద్వితీయ స్కంధం.

ఆదర్శ జీవితం జీవిద్దాము అని ఆశించడమే కాని, తమ ఆదర్శాలు ఇవి అని శకుంతలా సుదర్శనులు ఇంతవరకు అనుకొని ఉండలేదు. గృహస్థాశ్రమములో ఇప్పుడు వాళ్లు జీవితాన్ని సార్థకంగా గడపటానికి పూనుకొన్నారు.

మొదటినుంచీ వారు అనుకొన్నది ఏమిటంటే, భార్యా భర్తలు ఒకరినొకరు అర్థంచేసుకోవాలె. వారిద్దరిమధ్యా సానుభూతీ, అనురాగమూ, విశ్వాసమూ, స్వేచ్ఛా వుండాలె. ప్రశాంతంగా ఆనందంగా, కాలంగడిచిపోవాలె అని. అప్పుడే

వారిది ఆదర్శ దాంపత్యము అవుతుంది. ఇది సాధించడం ఎల్లాగు అని ఇద్దరూ ఆలోచించారు.

సుదర్శనం అన్నాడు. "జ్ఞానజ్యోతి ఉంటే జీవిత నౌకను చీకటి కోసల్లోనుంచి ఉత్తుంగ తరంగాల మీదుగానైన సరే నడిపించుకు పోవచ్చు. జ్ఞానసముపార్జన చెయ్యటం అవసరము అన్నాడు. శకుంతలకూడా ఆతనితో పూర్తిగా అంగీకరించింది. వారిద్దరూ కలిసి దేశ దేశాలలోని రేడియో ప్రసంగాలు వింటారు. చర్చించుకుంటారు. మంచి మంచి పుస్తకాలు ఇద్దరూకలిసి చదువుతారు. వాటినిగురించి చర్చించుకుంటారు. కాలం బాగానే గడిచిపోతున్నది.

సుదర్శనానికి ఎప్పుడూ వైజ్ఞానికదృష్టే. జ్ఞానసముపార్జనకై తోడ్పడని విషయాలపై అతనికి అంతగా ఆసక్తి లేదు. అనవసరమైన నవ్వులాట, తమాషా ఇల్లాంటివి లేవు. వృక్ష, జంతు శాస్త్రాలకు చెందిన విషయాలపై అతనికి మక్కువ. మనుష్యుల మాటలలో కంటే, పక్షుల కూతలలో అతనికి అందం కనిపిస్తుంది. వీరినిగురించీ వారినిగురించి కథలూ కబుర్లూ అతనికి ఇష్టంలేదు. విలువైన కాలాన్ని ఇవి వృథా చేస్తవి, అంటాడు.

కామేశ్వరరావు అప్పుడప్పుడు వస్తూఉండేవాడు. అతడు కాసేపు ఉండిపోతే ఒక సుడిగాలి వచ్చి పోయినట్లుండేది. ఏవో కోతలు కోసేవాడు. కబుర్లు చెప్పేవాడు. నవ్వించేవాడు.

శకుంతలకూడా అతనితో కలిసి నవ్వేది. కాని సుదర్శనం నవ్వేవాడు కాదు. ఒక బృహత్తార ఆకాశంలో తన దారిని పొయ్యేది పోక, ఏవో కొన్ని కారణాలచేత సూర్య

నికి సమీపంలోకి వస్తున్నదట : వస్తే సూర్యునిలో కలిగే మార్పులకు ఫలితంగా, భూమిమీద సముద్రాలన్నీ ఒక్కసారి పొంగిపోతై, అగ్నిపర్వతాలు పేలిపోతై, అనే పరిశోధకుల వ్రాతలు గమనిస్తున్నాడు. ఆ తారా ఇంక కొంచెం తప్పుకు తేపో ఏ ఉపద్రవమూ ఉండదు. ఈ విషయమై అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

కామేశ్వర్రావు "గిండీ" గుర్రపు పందాలను గురించి ఉత్సాహంగా మాట్లాడుతూవుంటే శకుంతల వింటూవుంటుంది. ఇదిఅనవసర కాలయాపన అనిసుదర్శనానికి అంతగా నచ్చలేదు.

కామేశ్వర్రావు, శకుంతలకు కథలూ, పద్యాలు చదివి వినిపించేవాడు. సరసం ఆడేవాడు. చమత్కారంగా మాట్లాడేవాడు. శకుంతల గంటలకొద్దీ అతనితో కాలం గడిపేది. ఈ ప్రసంగాలు ఆమె ఆదర్శాన్ని ఏమీ భగ్నంచేయలేదు.

అయితే ఇల్లాగ నవ్వులాటలో ఒక్కక్షణమైనా గడపటంసుదర్శనానికి అంతగా ఇష్టంలేదు.

"ఈ నవ్వులూ, వినోదాలు, ఆయనకు ఇష్టంలేదు, ఇల్లాగ కాలం వృథాచేయటం నాలో ఒకలోపం అనికూడా అతడు అనుకోవచ్చు. అయినా వచ్చిన ప్రమాదం ఏమీలేదు. నా లోపాలను ఆయన ప్రేమిస్తాడు, సంస్కరిస్తాడు. అంతగా అయితే"...అయినా నాకు ఇదేమో తప్పుపనిగా కనపడటం లేదు అని అనుకొంది శకుంతల ఈ విషయాన్ని గూర్చిబాగా ఆలోచించి.

సుదర్శనమైనా ఏమీఅనలేదు. శకుంతల జీవితంతాను జూపిన దారినే నడవాలని అతనికేమీ పట్టుదలలేదు మన

స్సులో కాస్త కష్టంగాఉన్నా. అతని మనస్సులోని భావాలను తెలుసుకొని శకుంతలమాత్రం కొంత ఆందోళన పొందింది.

శకుంతలా సుదర్శనులు ఎవరి ధర్మాలను వారు, ఎవరి ఆదర్శాలను వారు రక్షించుకొంటూ హాయిగా జీవిస్తున్నారు. ఎవరిస్వేచ్ఛ వారిది. ఇద్దరూ పరస్పరం ప్రేమించుకొంటున్నారు. ఒకరి ఎడల ఒకరికి అనురాగం ఉంది. వారి స్నేహితులంతా అనుకొన్నారు వారిది ఆదర్శ దాంపత్యమని. కొంతకాలం గడిచింది. శకుంతలా సుదర్శనులు కేవలమూ గృహస్థాశ్రమ విధులను నిర్వహించడంలో తృప్తిని పొందటంలేదు. శాయశక్తులా మనము సంఘానికి సేవచేయడం తమవిధి అనుకొన్నారు.

సుదర్శనానికి తోచిన విషయము ఏమిటీ అంటే, ప్రజలను విజ్ఞానవంతులుగా చేయాలని. అనారోగ్యానికీ, దారిద్ర్యానికీ కారణం అజ్ఞానము. ప్రజలలో విజ్ఞానం వ్యాపిస్తే, గ్రామాలు బాగుపడతవి. అస్పృశ్యత అనేమాట ఉండదు. ఐకమత్యము ఏర్పడుతుంది. ఎన్నో సాంఘిక సమస్యలకు చెందిన చిక్కులు విడిపోతవి. విజ్ఞానం ప్రజలలో వెదజల్లడానికై అతడు కృషిచేయడానికి నిశ్చయించాడు. కొన్నాళ్ళకి శకుంతలా సుదర్శనాల కృషివల్ల ఊళ్ళో ఒక సేవాసమితి స్థాపించారు కూడాను. ఆ సంఘము తరఫున, వైజ్ఞానిక విషయకమైన చర్చలు, ఉపన్యాసాలు ప్రసంగాలు జరుగుతూ ఉంటవి. బాలురకు ఒక పాఠశాల నడపటానికికూడా నిశ్చయించు

కున్నారు. క్రమంగా ఒక వితంతు శరణాలయం స్థాపించి అం
దులో చేరినవారికి తగినంత ఉన్నత విద్యాభ్యాసం కలిగిన
తరువాతనే కాని వివాహం చేయకూడదు అని నియమం
ఏర్పరచారు.

శకుంతల భర్త ఉద్దేశాలను గ్రహించి, అతనికి
చేదోడువాదోడుగా ఉంటోంది. సంఘంలో ఉండే అర్థంలేని
ఆచారాలను పిచ్చి నమ్మకాలను పోగొట్టాలని వారు సంక
ల్పించుకొన్నారు. అతనికి ఉపన్యాసాలంటే చికాకు. కాని
శకుంతల మహిళాసమావేశాలలో అనేక సాంఘిక విష
యాలు, విజ్ఞాన విషయాలు వీనిని గురించి ఉపన్యాసాలు
ఇస్తూ ఉంటుంది. ఇల్లాగ ఏకముఖంగా సంఘసేవ చేయటా
నికి అవకాశం కలిగింది.

కామేశ్వరరావు వీరిద్దరికీ కొంతవరకే తోడ్పడుతున్నాడు.
ఈ పిల్లవాళ్ళందరికీ చదువు వచ్చినా రాకపోయినా ఒకటే
అతనికి. ఈ వితంతులకు చదువు రావటం లేదే అని గాని,
వివాహాలు కావటం లేదే అనిగాని అతని కేమీ దిగులు లేదు.
ఏబాధా లేకుండా ఏదీతూ లేకుండా తనకు తోచిన సాయం
చేస్తున్నాడు. శరణాలయంలో కాస్త తెలివైన పిల్లలను చేర
దీసి వాళ్ళకు కథలు కబుర్లు చెపుతాడు. ఉమార్ ఖయ్యాం
చదివి వినిపిస్తాడు. నవ్విస్తాడు.

శకుంతల తమ దాంపత్యజీవితం ఆనందంగా గడపటం
ప్రధానంగా పెట్టుకొంది. ఇతరవిషయాలలో భర్తకు తోడ్ప
డుతున్నా అందులోనే మునిగిపోదు.

సుదర్శనానికి దీక్ష, పట్టుదల ఎక్కువ విజ్ఞానసము పార్జనమూ, ఆ జ్ఞానము సంఘంలో వ్యాప్తి చేయుటం, ఈ రెండే అతని కర్తవ్యాలు. ఇంటాబయటాకూడా దీనికి భిన్న మయిన విషయాలమీద అతనికి ఆసక్తి లేదు.

పట్టులోనూ, కార్యదీక్షలోనూ, కొద్ది భేదం ఉన్నా, ఆదర్శాల విషయంలో భార్యాభర్తలు ఏకముఖంగా నడుస్తు న్నారు. వారి సాంఘిక సేవకూడా ఇల్లాగ ఆదర్శప్రాయ మైంది.

ఒకరోజున ఒక తమాషా జరిగింది. సుదర్శనం కాయి తాలు ముందేసుక్కొని చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. న్యూజిలాండులో యావ రేజి జీవితం ౭౦ ఏండ్లు. కెనడాలో, ఫ్రాంసులోకూడా దగ్గర దగ్గర ౬౦ ఏండ్లు. ఇండియాలో ముప్పై యేండ్లకు తక్కువ. ఇట్టిదుస్థితికి సమాజం ఎంతవరకు బాధ్యత వహించింది? ఈ విషయాన్ని గురించే అతడు ఆలో చిస్తున్నాడు.

శకుంతల తనగదిలో అలంకరించు కొంటున్నది. సన్నని ఉప్పాడ జరీ చీర కట్టింది. గులాబి రంగుగల పట్టంచు రవిక తొడిగింది. మెడలో రెండుపేటల బంగారు గొలుసు మెరసి పోతున్నది. చెవులకున్న రవ్వల దుద్దుల కాంతి ఆమెముఖానికి ఒక వింత సోయగాన్ని చేకూర్చినది. ఆమె తలదువ్వుకొని, అర్థచంద్రాకారంగా పూలు పెట్టుకొని అద్దంలో చూచుకొని నవ్వుకొన్నది.

సుదర్శనం పక్క గదిలో పెన్సలు కొరుకుతున్నాడు. సంఘసమస్యను గూర్చి ఆలోచిస్తూ. శకుంతల సుదర్శనం గదిలోకి ఏదో కావలసినదానిలాగ రెండుమూడుసార్లు వచ్చింది. దేనికోసమో చూచి వెళ్ళిపోయింది.

చక్కగా అలంకరించుకొన్న భార్యను సుదర్శనం చూచాడు గాని అతని ముఖంలో ఏ విధమైన మార్పూ రాలేదు. ఆ నిమిషంలో కెనడాలో మనిషి అరవై సంవత్సరములు బ్రతికివుండటానికి కారణాలు ఏమై వుంటయ్యా అని అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

శకుంతల తన గదిలోకివెళ్ళి కూర్చుని ఆలోచించింది. పాపం ఆయన ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఆయనయందు తనకు సానుభూతివుండాలె. ఎందుకు లేదూ ? ఎప్పుడూ సానుభూతి చూపుతూనే వుంది. కాని ఇంత అందంగా సింగారించుకోవడం అతను మెచ్చుకోవాలని ఆమె కోరిక. శకుంతల గది గుమ్మందగ్గరకువెళ్ళి విలాసంగా చిటిక వేసింది. సుదర్శనం తలఎత్తి చూచాడు. శకుంతల రమ్మని సంజ్ఞ చేసింది.

"ఎందుకూ ?" అన్నాడు సుదర్శనం.

శకుంతల జబాబుచెప్పక నవ్వి గిరుక్కున తిరిగింది. మల్లెపూలు సువాసన సుదర్శనం గదిలోకి కూడా వ్యాపించింది.

సుదర్శనం లోపలికివచ్చి నుంచున్నాడు, శకుంతల అద్దంవైపు తిరిగి కుచ్చెళ్ళు సవరించుకొంది. వెనకాలనుంచి

వచ్చి, కళ్లు మూస్తాడో, ఇంకా ఏమన్నా తమాషాచేస్తాడో ఏమోనని అనుకొన్నది.

సుదర్శనం కాసేపు నుంచుని–"ఎందుకూరమ్మన్నావ్" అన్నాడు.

శకుంతల ఉలిక్కిపడి తిరిగిచూచి "వచ్చారా?" అని నవ్వింది.

ఎందుకు రమ్మన్నావూ? అని మళ్ళా అడిగాడు సుదర్శనం.

సుదర్శనాన్ని ఎందుకు రమ్మన్నదో శకుంతలకు చటుక్కున జ్ఞాపకం రాలేదు. ఎదురుగాచూస్తూ నుంచున్నది. చివ్వరకు అన్నది – "ఏమీలేదు" నేను మీటింగుకు వెళ్ళేదా?

"ఏమిటా మీటింగు? ఎక్కడ?" అని అడిగాడు సుదర్శనం. శకుంతల చెప్పింది: "ఆదర్శదాంపత్యము – మన ప్రత్యేక వ్యక్తిత్వము" అనేవిషయాన్ని గురించి, ఉపన్యాసం ఇస్తాను ఇవ్వాళ అని.

"మంచిది చాలా సంతోషము" అన్నాడు సుదర్శనం కాస్త దూరంగా నుంచుని.

శకుంతలకు వెళ్ళిపోడానికి బుద్ధి పుట్టలేదు. ఏదో ఒక పెద్ద సందేహము ఆమెను బాధిస్తున్నది. చివరకు ఆ సందేహము కాస్తా బయటపెట్టింది.

"ఇప్పుడే వెళ్ళేదా, కాసేపు ఉండేదా?" అని భర్తను కాస్త సమీపించింది.

"అది నీ ఇష్టం" అన్నాడు సుదర్శనం.

"అయితే నేను వెడతాను" అన్నది గునుస్తూ.

"ఊఁ—వెళ్ళు నేను వద్దన లేదే" అని సుదర్శనం తన గదిలోకి వెళ్ళి మానవజీవితం సుదీర్ఘం చెయ్యడానికి ఉపాయాలు ఆలోచించటం మొదలుపెట్టాడు. ఆమె తనగది పక్కనించి వెళుతూ వుండగా, గదిలోకి విసిరిన మల్లెపువ్వుల పరిమళం అతన్నేమీ కలత పెట్టలేదు.

ఇల్లాంటి తమాషాలు అప్పుడప్పుడు జరుగుతుండేవి. కాని ఒకరి నొకరు అర్థంచేసుకొన్న తరువాత వీటివలన వచ్చే ప్రమాదం ఏమీ లేదు.

కాలం గడిచిపోతున్నది. శకుంతలా సుదర్శనాలు, విజ్ఞానవ్యాప్తికి, కృషిచేస్తున్నారు. కాని లోకం వీళ్ళను అర్థం చేసుకోలేదు. వాళ్ళ పెండ్లినిగురించి, సనాతన ధర్మనిరసనను గురించి, వితంతు శరణాలయాన్ని గురించి, వారి సాంఘిక సేవను గురించి లోకంలో బోలెడు వదంతులు పుట్టినవి.